# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం, తెలంగాణ
10 ఫిబ్రవరి 2026


# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లుపూర్తి

## మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు



**అల్వాల్, ఫిబ్రవరి 9 ( నినాదం):** ఈనెల 15న మహా శివరాత్రి పురస్కరించుకొని అల్వాల్ సర్కిల్లోని శివాలయాలు అందంగా ముస్తాబవుతున్నాయి. టెంపుల్ అల్వాల్ లోని శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ఈనెల 12 నుండి 16 వరకు ఉత్సవ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకులు శ్రీధర్ శర్మ తెలిపారు. గురువారం ఉదయము గణపతి పూజ. దజరోహణం. రుద్ర హోమం. మండపరాధన. 13 శుక్రవారం 9 గంటలకు రుద్ర హోమం. మండపరాధన. శనివారం 9 గంటలకు రుద్ర హోమం రాత్రి 11 గంటలకు శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర కళ్యాణోత్సవం ఆదివారం మహాశివరాత్రి ఉదయం 4:00 నుండి అభిషేకము ప్రారంభం రాత్రి 8 గంటలకు స్వామివారి రథోత్సవం ఊరేగింపు మహా పూజ మహా వ్యాస పూర్విక ఏక దశరుద్రభిషేకం సోమవారం 8:30 పూర్ణాహుతి అన్నదాన కార్యక్రమం ఉంటుందని శ్రీధర్ శర్మ తెలిపారు కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు వార్తలు కాగలరు అన్నారు.

## కలెక్టర్ అబ్జర్వర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**వికారాబాద్, ఫిబ్రవరి (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్జర్వర్ జి. రవి ల సమక్షంలో సోమవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న వికారాబాద్, తాండూర్, కొడంగల్, పరిగి మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సుధీర్,డి ఇ ఓ రేణుకా దేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో సర్పంచ్‌లకు కొత్త అధికారాలు

**సర్పంచ్‌లకు అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత**

**అక్రమాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం**

**సర్పంచ్ ఛైర్మన్‌గా 11 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

**పౌష్టికాహార నాణ్యత, పంపిణీని తనిఖీ చేయనున్న ఈ కమిటీ**

**పిల్లలు, గర్భిణులకు పోషకాలు అందేలా చూడటమే లక్ష్యం**



**మునుగోడు, ఫిబ్రవరి 9 (నినాదం):** తెలంగాణలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అధికారాలు అప్పగించింది. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా సర్పంచ్‌లే చూసుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో రెండేళ్లపాటు గ్రామాల్లో ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పింది. చాలాచోట్ల పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఇటీవలే కొలువుదీరిన కొత్త పంచాయతీ పాలకవర్గాలకు ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సర్పంచ్‌ల నేతృత్వంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీకి సర్పంచ్ ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఏఎన్ఎం, స్కూల్ సైన్స్ టీచర్, ఒక రిటైర్డ్ ఉద్యోగి, చిన్నారుల తల్లులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి నెలా కేంద్రాలకు, అందుతున్న బియ్యం, పప్పు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి సరుకుల నాణ్యతను, పంపిణీని తనిఖీ చేస్తుంది. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న భోజనాన్ని కూడా పరిశీలిస్తుంది. లక్షల రూపాయల విలువైన పోషకాహారం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడటమే ఈ కమిటీ ప్రధాన విధి.

## 11 నుంచి నంది మేడారం జాతర



**నర్సంపేట ఫిబ్రవరి9 (నినాదం) :** నర్సంపేట మండలం రాజుపేట గ్రామంలో గల నంది మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ఈనెల 11 నుంచి13 వరకు ఘనంగా నిర్వహించబడుతుందని ఆలయ పూజాయి మోతే సంజీవ్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. 11న పగిడిద్దరాజు, జంపన్న వన దేవత శ్రీ సారలమ్మ తల్లిని గద్దెలకు తీసుకురావడం జరుగుతుంది. 12న వన దేవత శ్రీ సమ్మక్క తల్లిని గట్టు నుండి గద్దెలకు తీసుకురావడం జరుగుతుంది. 13న శుక్రవారం భక్తుల మొక్కులు, చెల్లించుకొనుట, అమ్మవార్లులకు బోనాలు, ఒడిబియ్యం, చీర జాకెట్, యాటపోతులు,కోడిపుంజులు చెల్లించబడుతుందన్నారు. నంది మేడారం జాతర తలపతి (సమ్మక్క వంశస్తులు) చంద వీరయ్య సమక్షంలో ,జాతర దేవర బాల మోతే సిద్దు , పలువురు పూజారులతో జాతర కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కలెక్టర్ ఆదేశాలు





**కీసర, ఫిబ్రవరి 9, (నినాదం):** కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో విఐపి దర్శనాలతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కీసర గుట్టకు వెళ్ళిన కలెక్టర్ మన చౌదరి, మల్కాజ్గిరి డిసిపి శ్రీధర్ , ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఐపీఎస్, ఆర్డిఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్ లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు పెంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారికేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికీ తెలిపారు. జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని, ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దర్శనార్థం వచ్చే వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి , ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కీసర ఆలయంకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, ఛైర్మన్ కు తెలిపారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి మున్సిపల్ కార్మికులతో గేట్ మీటింగ్
- మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26వేల వేతనం,4 లేబర్ కోడ్లను రద్దు, మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- సిఐటియు బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9 (నినాదం):** ఫిబ్రవరి 12న నిర్వహించే తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బాచుపల్లి మండల సిఐటియు కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్ని వర్గాల కార్మిక, కర్షకులకు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని, కార్మికుల్ని నిరాయుధులను చేసి పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లకు బంగారు పళ్ళెంలో పెట్టి బహుమానం ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. అందులో భాగంగానే వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను 6 సం"ల క్రితం (2019, 2020 సం" లలో తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడిన ఫలితంగా ఇంతకాలం వాటిని అమలు చేయకుండా ఆపగలిగామన్నారు. నేడు మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుతో కార్పొరేట్ సంస్థల సులభతర వ్యాపారానికి ద్వారాలు తెరిచింది. కార్పొరేట్ల ప్రయోజనాలు, వారి లాభాలు పెంచేందుకే 2025 నవంబర్ 21న లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2025 శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ముగిసే సమయంలో హడావుడిగా మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ నోటిఫై చేసింది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబి జి-రామ్ జీ స్కీమ్ను తెచ్చి రాష్ట్రాల పై ఆర్థిక భారం మోపింది. విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన సవరణ చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి లాంటి మరిన్ని వినాశకరమైన చట్టాలను, బిల్లులను తీసుకొచ్చి శ్రమజీవులపై దాడి చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న శ్రామిక వర్గాలను చావు దెబ్బ కొట్టింది.కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్ల అమలుతో 40 కోట్ల సంఘటిత, అసంఘటిత కార్మికులు, వారి కుటుంబాలు చితికిపోయెలా కార్పొరేట్లు లాభాలు ప్రోగేసుకోడానికి మార్గం సుగమం చేసిందని విమర్శించారు. బాచుపల్లి మండలంలోని కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రజా సంఘాలు ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు నాగభూషణ్, సిఐటియు బాచుపల్లి మండల కమిటీ సభ్యులు ఎల్లమ్మ, నరసింహ, అంజి, పోచమ్మ, పెంటమ్మ, లక్ష్మి, నరసింహ, బిక్షపతి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి




**జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి**

**నర్సంపేట ఫిబ్రవరి 9 (నినాదం):** ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. సోమవారం నర్సంపేట పట్టణంలో మునిసిపల్ కార్యాలయం నుండి నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆదనవు కలెక్టర్ మాట్లాడుతూ ఓటుహక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అని అన్నారు. ఓటర్లు డబ్బులు, మద్యం, ఇతర కానుకలకు ప్రలోభ పడవద్దన్నారు. స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకవం కోవాలన్నారు. అంతకు ముందు మునిసిపల్ కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా విద్యార్థులు, అధికారులు కలిసి ప్లకార్డులతో ఆర్టీసీ బస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి, ఆర్డీఓ ఉమా, మునిసిపల్ కమిషనర్ భాస్కర్ తహసీల్దార్ రవిచంద్ర రెడీ, ఎంపీడీవో శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియన్ కరాటే పోటీల్లో గీతాంజలి విద్యార్థుల విజయం



**నర్సంపేట ఫిబ్రవరి 9 ( నినాదం) :** ఆల్ ఇండియన్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2026 సంవత్సరంకుగాను నిర్వహించిన పోటీల్లో గీతాంజలి విద్యార్థులు విజయం సాధించారు. ప్రథమ బహుమతులు సాధించిన క్రీడాకారులకు నర్సంపేట కరాటే మాస్టర్, టోర్నీ ఇన్చార్జ్ రచ్చ శ్రీనివాస్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు బహుమతులు సాధించిన పి.సమన్విత , పి.సాత్విక్ ను అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి అనేక విజయాలు సాధించి ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎన్ రాజేష్ మాట్లాడుతూ విజయం సాధించడం అంటే మన బాధ్యత మరింత పెరిగిందని తెలుసుకొని మీరు సాధించిన విజయాలను చూసి గర్వపడకుండా భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని తెలిపారు. క్రీడల పైన మక్కువ చూపి విజయం సాధించడం అందరికీ సాధ్యం కాదని దానికి ఎంతో ఏకాగ్రత, కృషి ,పట్టుదల కావాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠినచర్యలు

**సిఐ వెంకటయ్య**



**సూర్యాపేట ప్రతినిధి ఫిబ్రవరి 9( నినాదం)**
ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ వెంకటయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి, సీతారాంపురం, మామిళ్ల గడ్డ, తులసమ్మ హోటల్, రాజీవ్ నగర్ కాలనీలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ లో విలీనమైన గ్రామాలలో పోలీసుల ఫ్లాగ్ మార్చి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రలోభాలకు గురి కాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు ఏడుకొండలు సాయిరాం ఐలయ్య శివతేజ మహేందర్ నాథ్ వెంకన్న పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో పోలీసుల భారీ ఫ్లాగ్ మార్చ్

**ఓటర్లకు భరోసా కల్పించిన కలెక్టర్, ఎస్పీ**





**కాగజ్ నగర్, ఫిబ్రవరి 9 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కొమురం భీమ్ జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. సోమవారం కాగజ్ నగర్ పట్టణంలో నిర్వహించిన పోలీసు ఫ్లాగ్ మార్చ్‌లో జిల్లా ఎస్పీ నితిక పంత్ తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిందని, ప్రస్తుతం యంత్రాంగం మొత్తం పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమైందని తెలిపారు. ఓటర్లను డబ్బు, మద్యం లేదా ఇతర రూపాల్లో ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అక్రమాలు జరిగినా లేదా సమాచారం ఉన్నా వెంటనే స్థానిక అధికారులకు లేదా కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.

**నిర్భయంగా ఓటు వెయ్యండి : ఎస్పీ నితిక పంత్**

జిల్లా ఎస్పీ నితిక పంత్ మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి భయాందోళనలు లేకుండా ఓటు వేయడానికి పకడ్బందీ నిఘా మరియు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచామని తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగిన ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రజల్లో ధైర్యాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డి.ఎస్.పి వహీయుద్దీన్ సీఐలు ప్రేమ్ కుమార్, సంతోష్, కుమారస్వామి పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం 10 ఫిబ్రవరి 2026

# కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి

**-కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**



**కరీంనగర్, ఫిబ్రవరి 9(నినాదం):** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి సోమవారం చివరి రోజు కావడంతో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావ్ ప్రతి డివిజన్లో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. వినూత్న శైలిలో ప్రజలను ఆకట్టుకున్నారు. బుల్లెట్ వాహనంపై నగరంలో విస్తృతంగా ప్రచారం చేశారు. వివిధ డివిజన్లలో రాజేందర్ రావ్ కార్నర్ మీటింగులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. డివిజన్లో ప్రజలు మహిళలు యువకులు, వివిధ వర్గాలకు సంబంధించిన వారంతా పెద్ద సంఖ్యల హాజరై సమావేశాలను విజయవంతం చేశారు. రాజేందర్ రావ్ బుల్లెట్ వాహనంపై తిరుగుతూ నగరం మొత్తం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ రావ్ మాట్లాడుతూ కరీంనగర్ ను గ్రేటర్ కరీంనగర్ గా మారుస్తామని కరీంనగర్ రూపు రేఖలు మారుస్తామని పేర్కొన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా తీగల వంతెన కు మెరుగులు దిద్దుతామని వెలుగులు విరజిమ్మేలా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో నగరంగా కరీంనగర్ తయారు చేస్తామని ముఖ్యమంత్రి మంత్రుల సహకారంతో పెద్ద ఎత్తున నిధులు సాధిస్తామని చెప్పారు. అభివృద్ధికి బాటలు వేయాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భూకబ్జాలు దోపిడీలు అవినీతికి పాల్పడి ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అలాంటి వారిని ఎన్నికల్లో బొంద పెట్టాలని మళ్ళీ గెలిపిస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది గనుక కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందన్నారు. కరీంనగర్ ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామని ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని రాజేందర్రావు పిలుపునిచ్చారు.

## నాగర్ కర్నూల్ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలి

**-ఎంఈఓ శంకర్ నాయక్**



**కల్వకుర్తి, ఫిబ్రవరి 9 (నినాదం) :** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడల్లో నాగర్ కర్నూల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని శంకర్ నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ రెండవ ఎడిషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ శంకర్ నాయక్ ,బాలు నాయక్ డాక్టర్ సోలపోగుల స్వాములు లు జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో ఉన్నత విద్య అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని మానసిక, శారీరక,ఆరోగ్యానికి, పాటించాల్సిన ఆహారపు అలవాట్లు జీవనశైలిపై అసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడాకారులు క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేయాలని యువత క్రీడల్లో రాణించి తమ సత్తా చాటాలని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి ప్రపంచ స్థాయికి క్రీడాకారులు ఎదగాలని సూచించారు. సీఎం కప్ వంటి క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకొని ఒలంపిక్స్ లో పథకాలు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పల్లెల నుండి ప్రపంచ స్థాయి విజేతల కొరకు ఈ సీఎం కప్ యువతకు క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుండి 300 క్రీడాకారులు అథ్లెటిక్స్ లోని 60,100,200,400,800, 1000, 1500, 3000, మీటర్ల పరుగుపందంలోనూ, లాంగ్ జంప్,హై జంప్, షాట్ పుట్ డిస్కస్, జావలిన్ క్రీడాంశాల్లో 14, 16, 18, 20 సంవత్సరాల లోపు పురుష, మహిళల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన వారు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ ప్రధాన అథ్లెటిక్స్ స్టేడియంలో జరిగే సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు, కార్యదర్శి అంజయ్య, వైస్ ప్రెసిడెంట్ బిక్షపతి, ఫిజికల్ డైరెక్టర్స్ ప్రసాద్, బాలసుబ్రమణ్యం, పరశురాముడు, రాఘవేందర్,మమత, వరలక్ష్మి,వెంకటరాములు, రాజేందర్ , శ్రీనివాస్, ఆచారి నర్సిరెడ్డి ,భాస్కర్ రెడ్డి,సతీష్ కుమార్, మంగులాల్,పుష్పలత, విజయలక్ష్మి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడపల్లి లక్ష్మీదేవి ఆలయం వద్ద విద్యుత్ సదుపాయాలు కల్పించాలి

**-విద్యుత్ శాఖ ఏఈకి గ్రామస్తుల వినతి**



**నల్లబెల్లి, ఫిబ్రవరి 9 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడపల్లి గ్రామంలోని లక్ష్మీదేవి (సత్తియాడి) ఆలయం పరిసరాల్లో తీవ్ర విద్యుత్ సమస్యలు నెలకొని ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ఆలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని గత 15 రోజుల క్రితం డీఈ హర్షి తెలియజేయగా, ఆయన సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి సంవత్సరం వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో బంజారా సోదరులు లక్ష్మీదేవి సత్తియాడి పూజ కోసం ఈ ఆలయానికి తరలివస్తారని, సరైన విద్యుత్,సదుపాయాలు లేకపోవడం వల్ల భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో నర్సంపేట విద్యుత్ శాఖ కార్యాలయంలో నల్లబెల్లి విద్యుత్ శాఖ ఏఈ మేడపల్లి గ్రామ సర్పంచ్ అర్రెం సాంబయ్య, మాజీ సర్పంచ్ లావుడియా తిరుపతి కలిసి, ఆలయం వద్ద వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ అవసరమైన విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని ఇప్పటికే పై అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఏఈ ఆలయం వద్ద నెలకొన్న విద్యుత్ సమస్యను పై అధికారులకు నివేదించి, త్వరలోనే సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అనుమతుల్లేకుండా పశువుల అక్రమ రవాణా

**రామాపురం క్రాస్ రోడ్డులో బొలెరో పట్టివేత...**

**కోదాడ, ఫిబ్రవరి 9 (నినాదం):** విజయవాడ పశువుల సంత నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా పశువులను అక్రమంగా తరలిస్తున్న బొలెరో మ్యాక్స్ వాహనాన్ని కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం రామాపురం క్రాస్ రోడ్డులో వాహన తనిఖీల్లో (4) ఆడ ఆవులు, (2) మగ దూడలు కలిపి మొత్తం 6 పశువులను తాళ్లతో కట్టివేసి, నీరుమేత లేకుండా హైదరాబాద్ వైపు తరలిస్తున్నట్టు గుర్తించారు. వాహన డ్రైవర్ ఇలపోగు రఘునాథ్, వాహన యజమాని కుమ్మర సురేష్, పశువుల వ్యాపారి వేల్పుల శివయ్యలపై కేసు నమోదు చేసి, పశువులను గోశాలకు తరలించినట్లు కోదాడ రూరల్ ఎస్ఐ సీహెచ్. గోపాల్ రెడ్డి తెలిపారు.

## దస్తగిరిపల్లిలో ఉపాధి హామీ పనుల ప్రారంభం



**నల్లబెల్లి, ఫిబ్రవరి 9 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులను సర్పంచ్ పులి రమేష్ ఈరోజు టెంకాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో పాటు కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగకరమని, ప్రతి అర్హుడైన కూలీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులను పారదర్శకంగా, నాణ్యతతో నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వివిధ వార్డుల సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గుల్లపెల్లి శ్రవణ్ , ఉపాధి హామీ కూలీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.

## మహిళా సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ పల్నాటి మూర్తికి సన్మానం



**నల్లబెల్లి, పిబ్రవరి 9 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గ్రామ అభివృద్ధి, మహిళల సంక్షేమం కోసం చేసిన సేవలను గుర్తిస్తూ మహిళా సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ పల్నాటి మూర్తి ఘనంగా సన్మానం నిర్వహించారు. మహిళల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండి పనిచేస్తున్నందుకు ఈ గౌరవం దక్కిందని మహిళా సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు మహిళల సంక్షేమానికి సర్పంచ్ పల్నాటి మూర్తి విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలు గ్రామానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ ప్రతినిధులు జనగాం సరిత, వేముల లక్ష్మి, కొండ సరస్వతి, వేముల కవిత, పల్నాటి రాణి, కాసర్ల శకుంతల, కొండ అనిత, జనగాం సప్న, కాల అరుణ, కాసం కల్పన, వాసం వనిల, వాసం సుభద్ర, గట్టికవిత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సహకరిస్తున్న సర్పంచ్ పల్నాటి మూర్తి మహిళా సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గౌడ్‌ల ఓటు గౌడ్‌లకే వేయాలి

**మోకుదెబ్బ రమేష్ గౌడ్ పిలుపు**



**నల్లబెల్లి, పిబ్రవరి 9 (నినాదం):** వరంగల్ జిల్లా నర్సంపేట, ఈ నెల 11వ తేదీన తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న గౌడ్ అభ్యర్థులను గెలిపించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ కులస్తులకు పిలుపునిచ్చారు. సోమవారం నర్సంపేట పట్టణంలో మోకుదెబ్బ కమిటీ ఆధ్వర్యంలో గౌడ్ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటు మనదే సీటు మనదే గౌడ్‌లకే ఓటు అనే నినాదంతో గౌడ్ కులస్తులు ఐక్యంగా ఓటు వేయాలని కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో చూపిన ఐక్యతను మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగించి, అత్యధిక మెజార్టీతో గౌడ్ బిడ్డలను గెలిపించి తెలంగాణ రాష్ట్రంలో గౌడ్‌ల రాజకీయ ఐక్యత, సామాజిక చైతన్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. గౌడ్‌ల ఓటు అనే ఆయుధంతో భవిష్యత్తులో గౌడ్‌ల రాజ్యాధికారానికి పునాదులు వేయాలని రమేష్ గౌడ్ అన్నారు. నర్సంపేట పట్టణంలో 8వ వార్డు అభ్యర్థి కందుకూరి రజితఅశోక్ గౌడ్, 18వ వార్డు అభ్యర్థి దొమ్మటి రమ్యసంతోష్ గౌడ్, 20వ వార్డు అభ్యర్థి పంజాల శ్రీరామ్మూర్తి గౌడ్, 26వ వార్డు అభ్యర్థి లిఖితకృష్ణమూర్తి గౌడ్, 27వ వార్డు అభ్యర్థి గిరాగానిహైమావతిసాంబయ్య గౌడ్, 28వ వార్డు అభ్యర్థి జూలూరు రోజారాణి గౌడ్‌లకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సదానందం గౌడ్, సలహాదారులు రామగోని సుధాకర్ గౌడ్, వడ్లకొండ రాజు గౌడ్, జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ గౌడ్, నర్సంపేట మండల అధ్యక్షులు జనగాం మల్లికార్జున్ గౌడ్, గాదెగోని బాబు గౌడ్, గిరాగాని చంద్రమౌళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రభుత్వంలో బంగారం వెండి ధరలు ఆకాశాన్నంటాయ్

**-6 గ్యారంటీల అమలుతోపాటు త్వరలో మరికొన్ని సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుంది**

**-రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**



**కరీంనగర్, ఫిబ్రవరి 9(నినాదం):** 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీమతి ఆకుల నర్మదా నర్సయ్య, రవీందర్ లకు మద్దతుగా సోమవారం రోజున వినాయక నగర్ లో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరై ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ,గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి ఒక్కరికి కూడా ఇవ్వలేదు, మేము 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు అదనంగా కుటుంబ సభ్యుల పేర్లను జతచేసి వారందరికీ ఒక్కొక్కరికి ఆరు కేజీల చొప్పున సన్న బియ్యం అందజేస్తు న్నాము ఆరోగ్యశ్రీ కింద ఐదు లక్షల రూపాయల ఉచిత వైద్యాన్ని 10 లక్షలకు పెంచి పేద ప్రజలకు ప్రభుత్వం పక్షాన వైద్య సహాయాన్ని అందజేస్తున్నాము, మా అభ్యర్థులు రవీందర్ తో పాటు ఆకుల నర్మదా నర్సయ్యకి ఓట్లు వేసి మాకు మరింత బాధ్యతను పెంచడం వల్ల ఇల్లు లేని నిరుపేదలకు మేము తప్పకుండా ఇల్లు నిర్మించి ఇస్తామని తెలియజేస్తూ, ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజలకు ఇంకా మరెన్నో సేవలు చేయాలని ఆలోచన ప్రభుత్వానికి ఉంది, కాంగ్రెస్ పార్టీకి సంబంధించి మా సోదరులు మేయరుగా ఎన్నికైన తరువాత తప్పకుండా అన్ని పనులను పూర్తి చేస్తామని మనవి చేసుకుంటున్నాము, ఇల్లు లేని వారికి ఇళ్ల పట్టాలు లేని వారికి పేదవారికి అండగా ఉండే ఆలోచనలో భాగంగా బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అనునిత్యం పెరుగుతున్న వెండి బంగారం ధరలతో ఒక పేదవాడు అర తులము తులము కొద్దిపాటి బంగారము కూడా కొనుక్కో లేని పరిస్థితిలో ఉన్నారు. పేదల దగ్గర దోచుకుని పెద్దలకు పంచి పెట్టడమే బిజెపి సిద్ధాంతంగా మారింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండి మరింత బలం ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని కోరుకుంటూ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతి పౌరుడు ఒక బాధ్యతగా తీసుకొని తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన కరీంనగర్ ప్రజలను కోరుతున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై బిటీజేఎఫ్ హెచ్చరిక



**అశ్వాపురం, ఫిబ్రవరి 9( నినాదం):** జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ విషయంలో ప్రభుత్వం తారతమ్యాలు చూపకుండా, గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించి అర్హులైన వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అశ్వాపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత నిబంధనలను సడలించి చిన్నాపెద్దా మీడియా సంస్థల మధ్య తేడా లేకుండా జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమంతో పాటు సీఎం కార్యాలయ ముట్టడికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

## నర్సరీలో మొక్కల పెంపకం ప్రారంభం



**ధర్మారం ఫిబ్రవరి 9 ( నినాదం):** మండలంలోని చామనపల్లి గ్రామ 2026 సంవత్సరం గాను నూతన నర్సరి (మొక్కల పెంపకము) ప్రారంభించిన గ్రామ సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు, ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాపెల్లి శ్రీకాంత్,బెదిగం హారిక అంజయ్య,తిగుళ్ల రవళి కిరణ్ రెడ్డి,దాసరి సాగర్,ఫీల్డ్ అసిస్టెంట్ సుందరగిరి చందు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఖిలా వనపర్తిలో జనం బాట కార్యక్రమం



**ధర్మారం ఫిబ్రవరి 9 (నినాదం) :** మండలంలోని ఖిలవనపర్తి గ్రామంలో ఈరోజు సర్పంచ్ మోతే కనకయ్య ఆధ్వర్యంలో జనం బాట కార్యక్రమం ఒకటి, రెండవ వార్డులల్లో చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ఉన్న సమస్యలను తెలుసుకుంటూ అదే విధంగా డ్రైనేజీ వ్యవస్థ గాని సీసీ రోడ్ల నిర్మాణం, చేపట్టడం గురించి, విద్యుత్ దీపాలు సరి చేయడం, పింఛన్లు గురించి అడిగి తెలుసుకుని నోట్ చేసుకున్నామని సర్పంచ్ కనకయ్య అన్నాడు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోతే కావ్య వెంకటస్వామి వార్డు సభ్యులు రేగుల హరీష్ అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన సర్పంచ్



**అశ్వాపురం, ఫిబ్రవరి 9 (నినాదం ):** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామకూరి వెంకన్న ఇటీవల గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్ నాంపల్లి కేర్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు. సోమవారం మల్లెలమడుగు గ్రామ సర్పంచ్ మచ్చ నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగం మల్లయ్య, మానాది వెంకన్న, సామకూరి వీరన్న, గొడ్ల నాగేశ్వరరావు తదితరులు హాస్పిటల్‌కు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ముత్తాపురం పంచాయతీలో గ్రామసభ



**గుండాల,ఫిబ్రవరి 09 (నినాదం):** గుండాల మండల కేంద్రంలోని ముత్తాపురం గ్రామంలో సోమవారం గ్రామసభ సమావేశం పంచాయతీ కార్యదర్శి సతీష్ అధ్యక్షత నిర్వహించగా ఈ సమావేశంలో సర్పంచ్ కల్తి రాధా మాట్లాడుతూ, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మిషన్ భగీరథ, అంగన్వాడి, విద్యారంగంపై వ్యవసాయ శాఖల అధికారులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసి ప్రజలకు అన్ని వేళలు అందుబాటులో ఉండాలని ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయాణం చేయాలని మాట్లాడారు. ఉప సర్పంచ్ తాటి రమేష్ మాట్లాడుతూ ప్రజా అభివృద్దే గ్రామ అభివృద్ధి ప్రజలు అభివృద్ధి చెందాలి,గ్రామాలు అభివృద్ధి చెందాలి ప్రజలు ప్రజాప్రతినిధులకు అధికారులకు సహకరించాలని కోరారు. రెవిన్యూ అధికారి కే వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సీతారామారావు, వ్యవసాయ శాఖ అధికారి బాలరాజు, గ్రిడ్ డిపార్ట్మెంట్ కాశీశ్వర్ రావు, (ఎన్ఆర్ఈజీఎస్) టి ఏ నవీన్, ముత్తాపురం హెడ్మాస్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.